క్లుప్తంగా

తాగునీటి ఎద్దడి నివారణకు కృషి చేయాలి



కురవి: వేసవికాలంలో తాగునీటి ఎద్దడి నివారణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జెడ్పీ సీఈఓ పురుషోత్తం సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో కురవి, డోర్నకల్, సీరోలు మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు తాగునీటిని సక్రమంగా సరఫరా చేసేందుకు అధికారులు పాటుపడాలన్నారు. తాగునీటి ఎద్దడి ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో కురవి ఎంపీడీఓ వీరబాబు, శ్రీనివాసరావు, ఎండీ గౌస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో కళాశాలల అభివృద్ధి

మహబూబాబాద్ అర్బన్: దాతల సహకారంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మరింత అభివృద్ధి చెందుతాయని డీఐఈఓ సీహెచ్.మదార్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు శుక్రవారం విశ్రాంతి వ్యాయామ ఉపాధ్యాయుడు వంగ రామన్న నేమ్ బోర్డు బహూకరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గణేష్, అధికారులు రమేశ్, రావుల యాదగిరి, బాస్కెట్‌బాల్ కోచ్ వెలిశాల కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బస్తాల ట్రాక్టర్ బోల్తా

బయ్యారం: టైరు పంచర్ అయిన ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం బయ్యారం సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అల్లిగూడెం గ్రామానికి చెందిన చింత నవీన్ ట్రాక్టర్‌పై మొక్కజొన్న బస్తాలను తీసుకొని మహబూబాబాద్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో స్థానిక పాకాలేటి బ్రిడ్జి సమీపంలో టైరు పంచరై ట్రాక్టర్ అదుపుతప్పి ఇంజన్‌తో సహా బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ నవీన్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పట్టపగలే చోరీ..

మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని హస్తినపురం కాలనీలో నివాసం ఉండే అజ్మీర మంగీలాల్ ఇంట్లో పట్టపగలే చోరీ జరిగి రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.1.70 లక్షల నగదు అపహరణకు గురయ్యాయి. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

నల్లబెల్లం పట్టివేత

నెల్లికుదురు: అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం బస్తాలను పోలీసులు పట్టుకున్న సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై చిర్ర రమేశ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. నమ్మదగిన సమాచారం మేరకు తొర్రూరు నుంచి నెల్లికుదురు మండలానికి కారులో అక్రమంగా నల్లబెల్లం తరలిస్తున్న కారు తనిఖీ చేయగా రూ.70వేల విలువ చేసే 10బస్తాల నల్లబెల్లం, 2బస్తాల పటిక బెల్లం ఉందన్నారు. రాయపర్తి మండలం గుప్పడి తండాకు చెందిన గుగులోతు జాను, మల్లంపల్లి గ్రామ శివారు గుర్తూరు తండాకు చెందిన గుగులోతు పవన్‌లు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. వారిని విచారించగా నెల్లికుదురు మండలం జామాతండాకు చెందిన గుగులోతు నగేష్, వస్రాం తండాకు చెందిన గుగులోతు రవిలకు నల్లబెల్లం తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

సమస్యల వలయంలో బడి

- బిల్లులు రాక నిలిచిన 'మన ఊరు–మనబడి' పనులు
- అసంపూర్తిగా మరుగుదొడ్డి నిర్మాణం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



ప్రహరీ సరిగా లేని జిల్లా పరిషత్, ఎంపీపీఎస్



అసంపూర్తిగా నిలిచిపోయిన పాఠశాల మరుగుదొడ్లి, మూత్రశాల నిర్మాణాలు

మహబూబాబాద్ రూరల్: మండలంలోని ఆమనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో చేపట్టిన 'మన ఊరు–మనబడి' అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక హెచ్‌ఎం, ఏడుగురు ఉపాధ్యాయులు పనిచేస్తుండగా 140మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మండల ప్రజా పరిషత్ పాఠశాలలో ఒక హెచ్‌ఎం, ఏడుగురు ఉపాధ్యాయులు పనిచేస్తుండగా 126మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇదిలా ఉండగా మన ఊరు–మన బడిలో భాగంగా ఆమనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల ప్రజాపరిషత్ పాఠశాలను ఎంపిక చేసిన నేపథ్యంలో పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సంబంధించి ఆరు మరుగుదొడ్లు, మూత్రశాలలకు మరమ్మతులు చేపట్టగా సగం పనులు పూర్తికాగా నిధుల కొరత, బిల్లుల మంజూరు కాకపోవడం కారణంగా పనులన్నీ మధ్యలోనే అయిపోయాయి. దీంతో పాఠశాల విద్యార్థులు ప్రతి రోజు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసంపూర్తి పనుల కారణంగా రెండేళ్లగా విద్యార్థులు మలమూత్ర విసర్జన సమయంలో బయట ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. రెండు పాఠశాలల తరగతి గదుల్లో 16ఫ్యాన్లు, 16ట్యూబ్ లైట్లు ఏర్పాటు చేశారు. రూ.20లక్షల పైగా పెట్టుబడి పెట్టి పనులు చేయగా రూ.7లక్షల వరకు బిల్లులు వచ్చి రూ.13లక్షల వరకు బిల్లులు నిలిచిపోయాక మౌలిక వసతులు కల్పన మధ్యలోనే ఆగిపోయింది. నిధుల కొరత కారణంగా, బిల్లుల చెల్లింపు చేయకపోవడంతో పనులు చేయాల్సిన రెండు కిచెన్ షెడ్ల నిర్మాణాలు, డైనింగ్ హాల్ నిర్మాణం పనులు ఆగిపోయాయి. ప్రధానమైన రెండు పాఠశాలలకు నిర్మించాల్సిన ప్రహరీ పనులు కూడా ప్రశ్నార్థకంగా మారిపోయాయి.

బిల్లులు చెల్లిస్తే పనులు చేయిస్తాం..



మా గ్రామంలో చదువుతున్న పెద్దబడి, చిన్నబడి పిల్లల సౌకర్యార్థం మన ఊరు –మన బడిలో భాగంగా మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణాలు, కొత్తగా నీళ్ల సంపు, మంచి నీళ్ల ట్యాంకు నిర్మాణ, నల్లాలు పనులు చేయించాం. డబ్బులు మధ్యలో రాకుండా ఆగిపోవటంతో ఏళ్ల తరబడి పిల్లలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. బిల్లులు చెల్లిస్తే పనులు చేయిస్తాం.

– పూజారి మంగమ్మ, మాజీ సర్పంచ్, అమనగల్

ఇసుక ట్రాక్టర్లు, డంప్‌ల సీజ్



కేసముద్రం: ఇసుక డంప్‌లను సీజ్ చేస్తున్న పోలీసులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని వీఎస్.లక్ష్మీపురం గ్రామంలో ఓ ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని డ్రైవర్ సాయికుమార్, యజమాని యాకంబ్రంపై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై వి.దీపిక శుక్రవారం తెలిపారు.

కురవి: చిలుకోయలపాడు నుంచి సీరోలుకు అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి, ట్రాక్టర్ యజమాని మాన్యా, డ్రైవర్ బానోత్ శ్రీకాంత్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నగేష్ తెలిపారు.

డోర్నకల్: స్థానిక మైనారిటీ కళాశాల సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను రెవెన్యూ, పోలీస్ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. సుమారు ఏడు ట్రాక్టర్ల ఇసుకతో ఏర్పాటు చేసిన డంపును గుర్తించి పోలీసులతో కలిసి సీజ్ చేసినట్లు తహసీల్దార్ కృష్ణవేణి, ఆర్ఐ యాసిన్ తెలిపారు.

గూడూరు: మండలంలోని రాములుతండాలో శుక్రవారం ఓ వ్యక్తి అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుక రవాణా చేస్తుండగా సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు. రాములుతండాకు చెందిన భూక్య మంగ్య ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్నాడని విశ్వసనీయ సమాచారంతో పట్టుకున్నామని తెలిపారు.

కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి గ్రామ సమీపంలో గల వట్టివాగు పక్కన, అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను తహసీల్దార్ దామోదర్, ఎస్సై మురళీధర్‌రాజు శుక్రవారం సీజ్ చేశారు. డంపుల్లో సుమారు 50 ట్రిప్పులకుపైగా ఇసుక ఉన్నట్లుగా అధికారులు అంచనా వేశారు.

నీటి సమస్యపై వెంటనే స్పందించాలి



మాట్లాడుతున్న ఈఈ సురేందర్

దంతాలపల్లి: వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతాలలో కలిగే నీటి సమస్యలపై వెంటనే స్పందించాలని మిషన్ భగీరథ ఈఈ సురేందర్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం దంతాలపల్లి, నెల్లికుదురు, నర్సింహులపేట మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఇతర పంచాయతీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో ఏ మాత్రం నీటి సమస్య వచ్చిన వెంటనే స్పందించాలన్నారు. నీటి సరఫరాలో ఏవైనా సమస్యలు ఉన్నట్‌లెతై ఉన్నతాధికారులకు తెలిపి వెంటనే రిపేర్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు వివేక్‌రామ్, కిన్నెర యాకయ్య, బాలరాజ్, ఎంపీఓలు అప్సర్‌పాషా, పద్మ, పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

గూడూరు: వచ్చే వేసవికాలంలో గ్రామాల్లో ఎలాంటి తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ వీరస్వామి, ఎంపీఓ సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల పంచాయతీ కార్యదర్శులు, వాటర్ పంపు ఆపరేటర్లు, వాటర్‌మన్‌లతో సమావేశం నిర్వహించారు.

శాసన మండలిలో బీజేపీ గళం అవసరం

- జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి



తొర్రూరు: మాట్లాడుతున్న ఆచారి

తొర్రూరు: ఉపాధ్యాయ సమస్యలపై ప్రశ్నించేందుకు శాసన మండలిలో బీజేపీ గళం అవసరమని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డికి మద్దతుగా శుక్రవారం డివిజన్ కేంద్రంలో బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాజీ మంత్రి గుండె విజయరామారావు, బీజేపీ రాష్ట్ర నాయకులు లేగా రామ్మోహన్‌రెడ్డిలతో కలిసి ఆచారి మాట్లాడారు. సరోత్తంరెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లాల అధ్యక్షుడు సొడ రమేష్, వల్లభు వెంకటేశ్వర్లు, నాయకులు రాజమౌళి, పూసాల శ్రీమాన్, శివరాజ్ యాదవ్, రచ్చ కుమార్, మహేష్ పాల్గొన్నారు.

గుప్త నిధుల తవ్వకాలు

తొర్రూరు రూరల్: మండలంలోని మడిపల్లి గ్రామ శివారులో గుప్త నిధుల కోసం తవ్వకాలు చేశారంటూ సోషల్ మీడియాలో ప్రచారం ఊపందుకుంది. గ్రామ శివారులోని ఇటుక బట్టీల సమీపంలోని బావి దగ్గర గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసమే తవ్వకాలు జరిపారనే ఆనవాళ్లను ఆ మార్గంలో వెళ్లిన వారు గుర్తించారు. స్థానికులు 100కు సమాచారం అందించగా పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ జరిపారు. స్థానికుల సమాచారం మేరకు మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లికి గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని తహసీల్దారు ఎదుట బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు సమాచారం. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరపనున్నట్లు ఎస్సై ఉపేందర్ పేర్కొన్నారు.

రైల్వే బోర్డు చైర్మన్‌కు వినతి

గార్ల: గార్లలో మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదలను తిరిగి పునరుద్ధరించాలని కోరుతూ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర శుక్రవారం ఢిల్లీలో ఇండియన్ రైల్వే బోర్డు చైర్మన్, సీఈఓ సతీష్‌కుమార్‌జీకి వినతిపత్రం అందజేశారు.

బ్యాంకు అధికారులు తక్కువ డబ్బులు ఇచ్చారని ఆందోళన

మహబూబాబాద్ రూరల్: మండలంలోని అమనగల్ గ్రామంలో గల కెనరా బ్యాంక్ అధికారులు తాను రాసిచ్చిన దానికంటే ఎక్కువ మొత్తంలో డ్రా చేసి తనకు తక్కువగా డబ్బులు ఇచ్చారని నెల్లికుదురు మండలంలోని సంధ్యా తండా గ్రామానికి చెందిన బానోత్ కవిత ఆరోపించారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. అమనగల్ కెనరా బ్యాంకులో ఖాతా ఉండగా 8గ్రాముల బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.40వేలు అప్పుగా కావాలని కోరానని పేర్కొంది. అంతకంటే ముందుగా తన ఖాతాలో రూ.11,358 ఉండగా బంగారంపై రుణం తీసుకున్నాక రూ.40వేలు మాత్రమే తనకు ఇవ్వమని కోరినట్లు పేర్కొంది. బ్యాంక్ అధికారులు రూ.40నగదు ఇచ్చి రూ.50వేలు ఇచ్చినట్లుగా బ్యాంకు ఖాతా పుస్తకంలో ప్రింట్ చేసి ఇచ్చారని తెలిపింది. న్యాయం చేయాలని పేర్కొంది. బ్యాంక్ మేనేజర్ అజ్మీర జగన్‌ను వివరణ కోరగా.. బంగారు రుణం ఖాతాదారు కవిత ఓచర్ రాసి ఇచ్చిన విధంగానే ఆమెకు రూ.50వేలు నగదు చెల్లింపు జరిగిందన్నారు. నగదు లావాదేవీల విషయాలను బ్యాంకులో ఉన్నప్పుడే చూసుకోవాలని, గతేడాది అక్టోబర్ మాసంలో జరిగిన నగదు లావాదేవీల విషయాన్ని నాలుగు నెలల తర్వాత ఆమె పేర్కొనడం విచారకరమన్నారు.

దోపిడీకి గురవుతున్న మిర్చి రైతులు



మిర్చిని పరిశీలిస్తున్న నాయకులు

కేసముద్రం: ఆరుగాలం కష్టపడి మిర్చి పండించిన రైతులు మార్కెట్‌లో దోపిడీకి గురవుతున్నారని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, ఏఐకేఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ రెడ్డి హంసారెడ్డి అన్నారు. శుక్రవారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌ను ఏఐకేఎఫ్, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం సందర్శించి, మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డితో కలిసి మిర్చి యార్డును పరిశీలించారు. ఈ మేరకు మిర్చి యార్డులో రైతులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. మార్కెట్ మాయాజాలంలో మిర్చికి గిట్టుబాటు ధర దక్కడం లేదన్నారు. కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వర్‌రావు, గ్రేడ్ 3 సెక్రటరీ రాజేంద్రప్రసాద్, ఓదెల రాజన్న, శ్రీనివాస్, లింగయ్య, కంచ వెంకన్న, బొల్లోజు రామ్మోహనాచారి, తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర చెల్లించాలని వినతి



కురవి: వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కురవి: రైతులు పండించిన మిర్చి పంటకు గిట్టుబాటు ధర రూ.25వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆకుల రాజు, కోటయ్య, నల్లపు సుధాకర్, సత్యం, మనోహర్ పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర ఇప్పించండి

నెహ్రూసెంటర్: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు, మిర్చి పంటకు ధర తగ్గడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు రైతులు అమర్‌సింగ్, వెంకట్‌రెడ్డి విన్నవించారు. శుక్రవారం వేములవాడ నుంచి కొత్తగూడెం వెళ్తున్న కూనంనేని మానుకోటలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో కాసేపు ఆగి టీ తాగి, రైతులతో మాట్లాడారు. ఆయన వెంట సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారధి, అజయ్‌సారథిరెడ్డి, పెరుగు కుమార్ పాల్గొన్నారు.

మొండి బకాయిలకు సదావకాశం

కురవి: తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రుణం తీసుకుని రుణాలు చెల్లించని బకాయిదారులకు సదావకాశం లభించినట్లు తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ లోకేష్ తెలిపారు. శుక్రవారం బ్యాంకులో ఖాతాదారుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 31, 2024 వరకు రుణాలు చెల్లించకుండా ఉన్న మొండి బకాయిదారులకు వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీం ద్వారా రుణాన్ని తక్కువ మొత్తంలో పూర్తిగా క్లియర్ చేసుకోవచ్చని తెలిపారు.

సంక్షిప్త సమాచారం

యాజమాన్యంపై చర్య తీసుకోవాలి

గార్ల: ఖమ్మంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థిని డి.యోగానందిని ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడడానికి కారకులైన కళాశాల యాజమాన్యంపై చర్య తీసుకోవాలని పీడీఎస్‌యూ మండల ప్రధాన కార్యదర్శి మహేష్‌కుమార్ శుక్రవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు.

విద్యార్థుల తీరును గమనించాలి

దంతాలపల్లి: మండలంలో గల ఉన్నత పాఠశాలలలో ఉపాధ్యాయులు 8,9,10, తరగతి విద్యార్థుల తీరును ఉపాధ్యాయులు గమనించాలని తహసీల్దారు కాటం చంద్ర రాజేశ్వర్ అన్నారు. మండల విద్యాశాఖ అధికారి, ఎస్సై, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎండీఓ వివేక్‌రామ్, ఎంఈఓ శ్రీదేవి, ఎస్సై రాజు, హెచ్‌ఎంలు కృష్ణయ్య, వెంకట్రాజయ్య, రవి ఎంపీఓ అప్సర్ పాషా,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వీరభద్రుడికి 'ఛత్రం' బహూకరణ

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారికి ఇత్తడి ఛత్రం(గొడుగు)ను కుందూరు సద్గుణ జ్ఞాపకార్థంగా ఆమె భర్త యుగపతిరెడ్డి రూ.లక్ష విలువైన ఇత్తడి ఛత్రంను శుక్రవారం ఆలయ అధికారులకు బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్ రెడ్డి, ఆలయ ఈఓ సత్యనారాయణ, దాత కుటుంబసభ్యులు మేక దామోదర్‌రెడ్డి, ఉదయ, ధీరజ్, క్రాంతిశిఖరం, నిఖితారెడ్డి, తేజ్‌దీప్‌రెడ్డి, గట్ల మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం

నెహ్రూసెంటర్: బీసీల నుంచి ముస్లింలను తొలగించాలంటూ ముస్లిం, బీసీల మధ్య చిచ్చుపెట్టేందుకు బండి సంజయ్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని ముస్లిం జేఏసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ అహ్మద్‌ఖాన్ అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సలీంపాష, అజీజ్, ఫిరోజ్‌ఖాన్, బాబులాల్, సఫర్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్సైగా బయ్యారం వాసి

బయ్యారం: పోలీస్‌శాఖలో కానిస్టేబుల్‌గా చేరిన బయ్యారంలోని ముస్తాఫానగర్‌కు చెందిన షేక్ మౌలానా ఏఎస్సైగా ఖమ్మంలో ప్రమోషన్ పొందారు. కాగా ఏఎస్సైగా నియామకమైన మౌలానా శుక్రవారం ఖమ్మం సీపీ సునీల్‌దత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడాకారులకు అభినందనలు

నెల్లికుదురు: ఇటీవలే జరిగిన స్కూల్ గేమ్స్ వివిధ క్రీడల్లో రాష్ట్రస్థాయిలో సత్తాచాటిన నెల్లికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు కళాశాలకే కాకుండా జిల్లాస్థాయిలో పేరు ప్రతిష్ఠలు తీసుకొచ్చారని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో నిర్వహించిన స్కూల్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్రీడాకారులను అభినందించారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



మహబూబాబాద్ రూరల్: మండలంలోని జంగిలిగొండ గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యం కాగా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన పోతుగంటి జగన్నాథచారి ఈనెల 18న గ్రామం నుంచి ఆటోలో మహబూబాబాద్ పట్టణానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికిన ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కుమారుడు విజయ్ తెలిపాడు. ఆచూకీ తెలిస్తే 95426 16529, 78933 69756 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు పేర్కొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

దంతాలపల్లి: రైతులు మైలన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడి పొందాలని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న తెలిపారు. మండలకేంద్రంలో సాగులో ఉన్న మామిడి సాగు, ఆయిల్‌పాం తోటలను శుక్రవారం ఆయన సందర్శించారు.

సంత్ సేవాలాల్ జయంతి

కొత్తగూడ: సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను మండలకేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గాంధీనగర్ నుంచి నాయకులు నృత్యం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బోగ్ బండార్‌లో నాయకులు పాల్గొని సేవాలాల్ యొక్క చరిత్రను వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాంనాయక్, జెడ్పీ మాజీ చైర్మన్ బడే నాగజ్యోతి, ప్రొఫెసర్లు రవీందర్ నాయక్, రాజ్‌కుమార్ జాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై గూడూరు టు ప్రయాగ్‌రాజ్

గూడూరు: సనాతన హిందూ ధర్మం కోసం ప్రతీ హిందువు భక్తి మార్గంలో పయనిస్తూ ఆచారాలను కొనసాగించాలని హింధూ ధర్మ మండల పరిరక్షక్ పింగిళి హైందవ, చెల్పూరు రాకేష్ అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. ఈనెల 16న గూడూరు నుంచి రాయల్ ఎన్ఫీల్డ్ హిమాలయన్ బైక్‌పై ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు వెళ్లినట్లు తెలిపారు. పుణ్య స్నానమాచరించి మళ్లీ బయలుదేరి 21న శుక్రవారం గూడూరుకు చేరుకున్నట్లు తెలిపారు.

పెండింగ్ బిల్లులు ఇవ్వాలని వినతి

కురవి: మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శులు జెడ్పీ సీఈఓ పురుషోత్తం, ఎంపీడీఓ వీరబాబులకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

మాతృభాష దినోత్సవం

మహబూబాబాద్ అర్బన్/కురవి/డోర్నకల్: జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాల, నూలక రామచంద్రారెడ్డి కళాశాల, గాదెరుక్మారెడ్డి పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమమంలో డోలి సత్యనారాయణ, మద్దెర్ల రమేష్, కృష్ణప్రసాద్, శంకర్, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవం



తొర్రూరు రూరల్: మండలంలోని వెలికట్ట ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలనా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంధ్యారాణి, ఇబ్రహీం, రాకేష్‌కుమార్, చంద్రశేఖర్, రాణి పాల్గొన్నారు.

రవీందర్‌ను గెలిపించాలి

నెహ్రూసెంటర్: ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్‌ను గెలిపించాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ పురుషోత్తరావు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నీలం శ్రీనివాస్, చందా గోపి, తుంపిళ్ల శ్రీనివాస్, జిన్నారెడ్డి శ్రీనివాస్, పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

డ్రై ఫ్రూట్స్, కిరాణా షాపుల్లో చోరీ

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీసాయిబాలాజీ డ్రై ఫ్రూట్స్ అండ్ కిరాణ దుకాణంలో చోరీ జరిగి రూ.60వేల విలువైన సుగంధ ద్రవ్యాలు, డ్రై ఫ్రూట్స్ అపహరణకు గురయ్యాయి. రోజు మాదిరిగానే షాపు యజమాని కొండ్లె శ్రీను తమ దుకాణాన్ని గురువారం రాత్రి బంద్ చేసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం వచ్చి షాపు తెరచి లోనికి వెళ్లగానే సరుకులన్నీ చిందరవందరగా పడిఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా సీసీఎస్ పోలీసులు, ఫింగర్ ప్రింట్స్ బృందం సభ్యులు ఆధారాలు సేకరించారు. సీసీ కెమెరాలకు సంబంధించిన హార్డ్ డిస్క్ ధ్వంసం చేసి తీసుకెళ్లారు. చోరీలో రూ.60వేల విలువైన సుగంధ ద్రవ్యాలు, డ్రై ఫ్రూట్స్ అపహరణకు గురయ్యాయని పోలీసుల ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏడాది కాలం క్రితం కూడా ఇదే షాపులో దొంగలుపడి విలువైన సుగంధ ద్రవ్యాలు, డ్రై ఫ్రూట్స్ తీసుకుని వెళ్లారని బాధితుడు శ్రీను తెలిపారు. కాగా జిల్లా కేంద్రంలోని శ్రీసాయి బాలాజీ డ్రై ఫ్రూట్స్ అండ్ కిరాణ దుకాణంలో చోరీ జరిగిన ఇదే బజారులోగల ఓ ప్రైవేట్ ఆస్పత్రి, హోటల్, మెడికల్ షాపులోనూ కొద్దిరోజుల క్రితం చోరీలు జరిగినట్లు బాధితులు పేర్కొన్నారు.

మాజీ సర్పంచ్‌పై గుర్తుతెలియని వ్యక్తుల దాడి

గార్ల: బీఆర్‌ఎస్ మాజీ సర్పంచ్ ధరావత్ సక్రుపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైన సంఘటన శుక్రవారం పూమ్యాతండా సమీపంలో చోటుచేసుకుంది. బాధితుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. సేరిపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ధరావత్ సక్రు మండల కేంద్రమైన గార్లకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో పూమ్యాతండా దాటిన తర్వాత గుర్తు తెలియని ఆరుగురు వ్యక్తులు సక్రు బైక్ ఆపి కర్రలతో దాడికి పాల్పడ్డారు. దాడి చేస్తుండగా బాధితుడు కేకలు వేయడంతో సమీపంలో మిర్చితోట ఏరుతున్న కూలీలు వచ్చేసరికి దుండగులు పరారయ్యారు. వివరాలు తెలియాల్సి ఉంది.

ఆటోను ఢీకొట్టిన లారీ.. చిన్నారికి గాయాలు

కేసముద్రం: ప్రమాదవశాత్తు ఆటోను వెనక నుంచి లారీ ఢీకొట్టగా, ఓ బాలికకు గాయాలైన సంఘటన కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని పొట్టి శ్రీరాములు సెంటర్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మంకు చెందిన నీరుడు శివశంకర్ అనే వ్యక్తి కొన్నేళ్ల క్రితం తన కుటుంబంతో కలిసి మానుకోటలో ఉంటూ జీవనాన్ని సాగిస్తున్నాడు. ఈక్రమంలో నెక్కొండ మండలం పెద్దకోర్పోలు గ్రామంలో తన సమీప బంధువు ఇంట్లో జరిగే ఫంక్షన్‌కు బైక్‌పై బయలుదేరగా, తన భార్య చందన, కూతురు భవ్యశ్రీతోపాటు, సమీప బంధువులు కలిసి ఆటోలో బయలుదేరారు. ఈక్రమంలో కేసముద్రంస్టేషన్‌లోని పొట్టిశ్రీరాములు సెంటర్ వద్ద ఆటోను, వెనక నుంచి వచ్చిన లారీ ప్రమాదవశాత్తు ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో ఆటోలో కూర్చున్న భవ్యశ్రీ అనే చిన్నారి తలకు తీవ్ర గాయం కావడంతో మానుకోట ఆస్పత్రికి తరలించారు.

చెరువులో వ్యక్తి గల్లంతు

తొర్రూరు రూరల్: మండలంలోని మాటేడు గ్రామంలో చెరువులో స్నానానికి వెళ్లిన వ్యక్తి గల్లంతైన ఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పెనుగొండ ఐలయ్య(48) అనే వ్యక్తి గ్రామంలో బాతుక వెంకన్న అంత్యక్రియల్లో పాల్గొని బంధువులతో కలిసి స్నానానికి చెరువులోకి దిగాడు. ఈత కొట్టే క్రమంలో చెరువు చివరి వరకు ఈదుతానని బంధువులతో చాలెంజ్ చేశాడని సమాచారం. ఆ క్రమంలోనే చెరువు మధ్యకి వెళ్లాక అతడి ఆచూకీ తెలియరాలేదని తెలిసింది. ఎంతకూ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులకు బంధువులు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. శనివారం సైతం గాలింపు కొనసాగిస్తామన్నారు.

సుభాష్‌వీధిలో చోరీ..

డోర్నకల్: స్థానిక సుభాష్ వీధిలోని ఓ ఇంట్లో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సుభాష్‌వీధికి చెందిన రిటైర్డ్ రైల్వే ఉద్యోగి లకావత్ హరిరాం రెండు రోజుల క్రితం భార్యతో కలిసి ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లారు. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగలగొట్టి ఇంట్లో దేవుడి గుడిలో ముడుపు కోసం ఉంచిన రూ.30వేల నగదు చోరీ చేశారు. ఎస్సై గడ్డం ఉమ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

దంతాలపల్లి: వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు మంచి భోజనం, మంచి వాతావరణం అందించాలని తహసీల్దారు రాజేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకులాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎంపీడీఓ వివేక్ రామ్, ఆర్ఐ నజీముద్దీన్, ఎంపీఓ అప్సర్ పాషా పాల్గొన్నారు.

నర్సింహులపేట: మండల కేంద్రంలోని కస్తూర్బా ఆశ్రమ బాలికల పాఠశాలను శుక్రవారం సాయంత్రం మండల ప్రత్యేకాధికారి ప్రేమ్‌కుమార్ సందర్శించి తనిఖీ చేశారు. తహసీల్దార్ నాగరాజు, హెచ్‌ఎం స్వప్న పాల్గొన్నారు.

నెల్లికుదురు: వసతి గృహాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలోని వసతి గృహాలను తహసీల్దార్ కె.రాజు, ఎంపీడీఓ బాలరాజుతో కలిసి తనిఖీ చేశారు.